క్లుప్తంగా

ఉచిత కంటి పరీక్షలు

మదనపల్లె సిటీ : స్థానిక చైతన్య సంస్థలో మంగళవారం మహాకార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అగర్వాల్ ఐ హాస్పిటల్, దృష్టినయన కంటి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. విద్యార్థులు, వృద్ధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహాకార్య ఫౌండేషన్ నిర్వాహకులు పూర్ణిమ, సంస్థ ఏఓ బాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు

మదనపల్లె సిటీ : ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగని ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఏపీనాయుడు కాలనీలో క్రై, ఫోర్డు సంస్థల ఆధ్వర్యంలో పూరిపదాయ్ దేసీకి భళాయ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా మహిళా గ్రూపు సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో మగ పిల్లతో పాటు ఆడ పిల్లలను కూడా ఉన్నత చదువులు చదివించాలన్నారు. నేడు మహిళలు అన్ని రంగాలో రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వం మహిళలకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమలో ఫోర్డు సిబ్బంది రాధారాణి, స్వర్ణకుమారి, మెప్మా ఆర్పీ శశికళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్స్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : జిల్లా సబ్ జూనియర్స్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఈనెల 25న ఎంపిక జరగనున్నట్లు జిల్లా అసోసియేషన్ సభ్యులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని వశిష్ట పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన రోజు సర్టిఫికెట్ తమ వెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9502074146, 9052934896ను సంప్రదించాలన్నారు.

ఉద్యాన పంటలకు ప్రాధాన్యత

– పీడీ మద్దిలేటి

బి.కొత్తకోట : ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. మంగళవారం బి.కొత్తకోటకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు అధిక నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 4,600 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేలా ప్రణాళిక సిద్ధం చేయగా అందులో 3,200 ఎకరాలకు మంజూరు ఇచ్చామని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 92.67 లక్షల పనిదినాలు కల్పించగా ప్రస్తుత ఏడాదిలో ఇప్పటికే 51.81 లక్షల పనిదినాలు కల్పించామని చెప్పారు. ఇంతవరకు రూ.135 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.

రికార్డుల పరిశీలన

వాల్మీకిపురం : మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి రికార్డులు దగ్ధం కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. సోమవారం రాత్రి వాల్మీకిపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల భద్రత విషయమై ప్రత్యేక అధికారులను నియమించారు. హెచ్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, పీలేరు, గాలివీడు తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా నియమించి, సోమవారం రాత్రి రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, రికార్డులను మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలించారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరం

పీలేరు : మండలంలో ప్రజలకు అనువుగా స్థానిక మూడో గ్రామ సచివాలయంలో బుధవాం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. 5 సంవత్సరాల లోపు పిల్లలను నూతనంగా ఆధార్ కార్డు పొందడానికి, ఆధార్ ఉన్నవారు ఏమైనా మార్పులు, చేర్పులు చేయుటకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు స్థానిక కోటపల్లె క్రాస్‌లోని మూడో గ్రామ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు పంచాయతీ అనుమతి తప్పనిసరి

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు పంచాయతీ అనుమతి తప్పనిసరని అని ఈఓ గురుమోహన్ అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు అర్బన్ అభివృద్ధి అథారిటీ (చుడా) నిబంధనల మేరకు పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా వేసిన లేఅవుట్‌లలో పంచాయతీ అప్రూవల్ ఇవ్వబడవని తెలిపారు. స్థలాలు కొనుగోలు చేసుకునే వారు సరిచూసుకోవాలని సూచించారు. ఇంటి పన్నులు, నీటి కొళాయి పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు. పన్నుల వసూళ్లకు ఐదు టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతి లేని ఇళ్ల నిర్మాణాలకు, పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

ఇక పింఛన్లపై సామాజిక తనిఖీ

బి.కొత్తకోట : ప్రతినెలా అందిస్తున్న సామాజిక పింఛన్లపై సామాజిక తనిఖీ నిర్వహిస్తామని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం బి.కొత్తకోట ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ వర్గాలకు అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్లపై జిల్లాలో ఆరు మండలాల్లో తనిఖీలు ఉండేవని చెప్పారు. ప్రస్తుతం ప్రతి మండలంలో ఈ తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందన్నారు.

పెట్టుబడి సాయం కోసం అన్నదాత ఎదురుచూపు

- అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామన్న టీడీపీ ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో సేద్యం సమయానికి రైతు భరోసా నిధులు



మదనపల్లె/ పీలేరు/ బి.కొత్తకోట : ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం అందిస్తామని మెనిఫేస్టోలో ప్రకటించారు. సూపర్‌సిక్స్‌లోనే ఈ హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిసి టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. ఇదే సమయంలో ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతాంగం పంటల సాగు, పొలం పనుల్లో మునిగిపోయింది. అయితే గత ఐదేళ్లలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతాంగానికి అందించిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా పథకం ఇప్పుడు అమలుకు నోచుకోలేదు. కొత్త ప్రభుత్వం అమలు చేస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ఇంకా రూపుదాల్చలేదు. ఫలితంగా రైతులకు ప్రభుత్వం నుంచి చేయూత కరువైంది. దీనితో సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతులకు వెంటనే రూ. 20 వేల ఆర్థిక సాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం (రూ.కోట్లలో)

మండలం	రైతుల సంఖ్య	చెల్లించిన మొత్తం
మదనపల్లె నియోజకవర్గం..		
మదనపల్లె	8,744	11.80కోట్లు
నిమ్మనపల్లె	6,042	8.16 కోట్లు
రామసముద్రం	7,371	9.95 కోట్లు
తంబళ్లపల్లె నియోజకవర్గం		
బి.కొత్తకోట	7,830	రూ.29.23
కురబలకోట	6,444	రూ.24.13
పెద్దతిప్పసముద్రం	10,848	రూ.41.09
తంబళ్లపల్లె	9,074	రూ.34.41
పెద్దమండ్యం	6,751	రూ.25.62
ములకలచెరువు	7,799	రూ.29.23
పీలేరు నియోజకవర్గం		
పీలేరు	6852	రూ.9,25,02,000
కేవీపల్లె	9200	రూ.12,42,00,000
కలికిరి	5475	రూ.7,39,12,500
కలకడ	6046	రూ.8,16,21,000
గుర్రంకొండ	7956	రూ.10,74,06,000
వాల్మీకిపురం	6191	రూ.8,35,78,500

రైతును ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఖరీఫ్ సీజన్‌లో మూడు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాను. దుక్కులు, ఎరువులు, విత్తనాలు, కలుపు, కూలీలకు ఇప్పటి వరకు రూ.40 వేల దాకా ఖర్చు వచ్చింది. టీడీపీ ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరుతో ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పింది. పీఎంకిసాన్ నిధులు రూ.2 వేలు జమ చేశారు. రాష్ట్రం వాటా మాత్రం ఇంకా రైతులకు రాలేదు. గత ప్రభుత్వంలో రైతు భరోసా ద్వారా అదునులో పెట్టుబడి సాయం అందేది. టీడీపీ పాలకులు కూడా రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో పెట్టుకుని అన్ని విధాలా రైతాంగాన్ని ఆదుకోవాలి. – కటికపల్లి శివారెడ్డి, పెద్దతిప్పసముద్రం మండలం

పెట్టుబడి సాయం అందించాలి...



ఖరీఫ్ సీజన్‌లో ఉన్న కొద్దిపాటి పొలంలో టమాటా, వేరుశనగ, వరి సాగుచేస్తున్నాను. పంటకు సంబంధించి పెట్టుబడుల ఖర్చు అధికంగా వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోళ్లకు తడిసి మోపెడు అవుతోంది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ప్రకటించిన రూ.20 వేలు అందిస్తే, కొంతమేరకైనా భారం తగ్గించినట్లవుతుంది. – రవి, చింతలవారిపల్లె, నిమ్మనపల్లె

హామీ నిలుపుకోవాలి..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాతలకు పెట్టుబడిసాయంగా ఏటా రూ.20వేలు అందిస్తామని తెలిపింది. చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చింది. రైతులందరూ వేరుశెనగ పంటలో కలుపు తీసేందుకు అధికంగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ప్రభుత్వ సాయం అందితే, కొంత మేర ఊరట లభిస్తుంది. కొంతలో కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుంది. – గంగాధర, శ్రీరామపురం, తవళం పంచాయతీ, నిమ్మనపల్లె

దర్యాప్తు పారదర్శకంగా చేపట్టాలని నిరసన

మదనపల్లె : సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్ని ప్రమాద ఘటనలో దర్యాప్తు పారదర్శకంగా చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్ధమైన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చెయ్యాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కదిరి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. నిందితులను వదలొద్దు, అమాయకులు బలి చేయొద్దు, సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్నిప్రమాద సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి. వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చెయ్యాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్నికి ఆహుతి కావడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కీలకమైన 22 ఏ విభాగం, తపాలా విభాగం, ఏఓ కార్యాలయ విభాగంలో ఉన్న ఫైళ్లు డాక్యుమెంట్లు డేటా కాలి బూడిద అయ్యాయని తెలిసినప్పుడే..షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేదని, మానవ ప్రేరేపిత సంఘటనగా సీపీఎం ప్రకటించిందని తెలిపారు. రాష్ట డీజీపీ, సీఐడీ చీఫ్ హుటాహుటిన మదనపల్లికి వచ్చినా ఏమి తేల్చకపోవడం విడ్డూరం అన్నారు. జరిగిన సంఘటనను రాజకీయాలకు ముడిపెట్టి లాభం పొందాలని, అధికారులను బలి చేసేందుకు పూనుకోవడం దుర్మార్గం అన్నారు. డీజీపీ అధికార పార్టీ నేతలను మాత్రమే కార్యాలయం లోపలికి తీసుకెళ్లి మంతనాలు జరపడం వలన సంఘటనతో సంబంధం లేని అధికారులను కూడ బలి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. సమగ్రంగా దర్యాప్తు జరిపించి, సంఘటనతో సంబంధం ఉన్న అందరిని శిక్షించాలని, భూబాధితులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, ప్రభాకర్, రమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద దర్యాప్తు పారదర్శంగా నిర్వహించాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఘనంగా తిలక్, ఆజాద్‌ల జయంతి

వాల్మీకిపురం : వాల్మీకిపురం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం లోకమాన్య బాలగంగాధర్ తిలక్, విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని గండబోయనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తిలక్, ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ స్వాతంత్య్రం నా జన్మ హక్కు అని చాటిన స్వాతంత్య్ర సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ అని, బ్రిటిష్ వారిని ఎదురించిన ధీశాలి, దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. వారి సేవలను, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డిమోహన్, ఉపాధ్యాయులు మురళి, శ్రీకాంత్, కిషోర్, శేఖర్, శ్రీలత, సిలార్‌బి, రూప, సిరాజున్నీసా, ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



తిలక్, ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

పెద్దతిప్పసముద్రం : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లి డీఎల్‌పీఓ నాగరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని సంపతికోటలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంతేగాక తాగునీరు కలుషితం కాకుండా పైపుల లీకేజీలను అరికట్టాలని, 15 రోజులకోసారి తాగునీటి ట్యాంకులను ఖచ్చితంగా క్లోరినేషన్ చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్, కార్యదర్శి, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి, ఈవోఆర్డీ యోగానంద్, సర్పంచ్ రెడ్డెప్ప, కార్యదర్శి నాగరాణి తదితరులు ఉన్నారు.



సంపతికోటలో సూచనలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

తంబళ్లపల్లె : మండలంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ క్రిష్ణమూర్తి, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం పారిశుధ్య పక్షోత్సవాల భాగంగా అన్ని గ్రామ పంచాయతీలలోనూ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు ఆగస్టు 5వతేదీ వరకు కొనసాగుతాయన్నారు. పల్లెల్లో మురుగునీటి కాలువలు , కాలనీల్లో ట్యాంకులు శుభ్రపరచడం, తాగునీటి బోర్ల వద్ద గుంతలు గుర్తించి పూడ్చివేయాలన్నారు. ప్రజలను చైతన్య పరిచి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. పంచాలమర్రి, ఎర్రసానిపల్లె, రేణుమాకులపల్లెలో జరుగుతున్న పనులను పర్యవేక్షించామన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు డయేరియా, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికుడు

సచివాలయం తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ

మదనపల్లె : మండలంలోని తట్టివారిపల్లె గ్రామ సచివాలయాన్ని మంగళవారం జిల్లా పరిషత్ సీఈఓ గ్లోరియా ఆకస్మికంగా తనిఖీచేశారు. ఎంపీడీఓ భానుప్రసాద్‌తో కలిసి సచివాలయానికి వెళ్లిన ఆమె సచివాలయంలోని అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి పరీక్షలు, ఓవర్‌హెడ్ ట్యాంక్ క్లీనింగ్ తదితర వివరాలపై సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఓ రెడ్డెమ్మ, సీనియర్ సహాయకులు శ్రీధర్, జూనియర్ సహాయకులు రూప్‌నాథ్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కె.రోహిణి

నిమ్మనపల్లె : పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరియా పశువైద్యశాల మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె రోహిణి అన్నారు. మంగళవారం కొండయ్యగారి పల్లె పంచాయతీలోని వెంకోజిగారి పల్లెలో పశు వైద్యాధికారి డాక్టర్ సాధుసురేష్‌తో కలిసి ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాడి రైతులకు పశువుల పెంపకం, పశువులకు అందించే పశుగ్రాసం, దాణా, పశువులలో కనిపించే సాధారణ వ్యాధి లక్షణాల గుర్తింపు, పాల ఉత్పత్తి, లేగ దూడల పెంపకం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రత్యేక పశు వైద్య శిబిరం ద్వారా పశువులకు డీవార్మింగ్ మెడిసిన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో అధిక శాతం మంది ప్రజలు పశుపోషణ, పాల ఉత్పత్తి పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వాతావరణంలో మార్పులు వల్ల కాలానుగుణంగా పశువులలో కొన్ని రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పాడి రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వేల రూపాయలు విలువైన పశువులను వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. పశువులలో కొద్దిపాటి అనారోగ్య సమస్యలను గుర్తించినా వెంటనే పశు వైద్యాధికారులకు తెలియజేయాలని అన్నారు. పశువులను ఉంచే షెడ్ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శిరీష, హరి, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ కె రోహిణి, పశువైద్యాధికారి సాధు సురేష్

పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలు వద్దు

నగర పంచాయతీ కమిషనర్ మనోహర్

బి.కొత్తకోట : పర్యావరణానికి హాని కలిగించే వినాయక విగ్రహాలను ఎవరూ ప్రతిష్టించరాదని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఏఈ రాజేంద్ర, ఆర్ఐ శ్రీనివాసులు, టౌన్‌ప్లానింగ్ వార్డు ఆఫీసర్ సందీప్‌లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. వినాయక చవితి పండుగ కోసం రసాయనాలతో తయారుచేసే విగ్రహాలను ప్రతిష్టించకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, సింథటిక్ పెయింట్లతో విగ్రహాలు తయారు చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మట్టితో తయారుచేసిన విగ్రహాలనే ప్రతిష్టించాలని, వీటికి మాత్రమే అనుమతి ఇస్తామని చెప్పారు. రసాయనిక విగ్రహాలపై వాటి విలువకు 200 శాతం జరిమానా విధిస్తామని చెప్పారు. చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు. వీటి తయారీదారులకు లైసెన్సులు మంజూరు చేయమని స్పష్టం చేశారు. వినాయక చవితిరోజు మట్టి గణపతులను పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం..అన్న నినాదంతో పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించి అవగాహన కల్పిస్తామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ విన్నవించారు.



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ మనోహర్

పాఠశాల అకస్మిక తనిఖీ

పెద్దమండ్యం : పెద్దమండ్యం ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ సి. వెంకటరమణయ్య మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజనం మెనూ మేరకు అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం వద్ద పైపు లీకేజీతో నిలువ ఉన్న నీటిని పరిశీలించి పైపుకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జనార్ధన్, పి జగన్‌మోహన్, హెచ్ఎం వేమల బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉపాధి ఖర్చు రూ.7.42 కోట్లు

- రికవరీ రూ.36 వేలు
- ఈ లెక్క తేల్చేందుకు చేసిన ఖర్చు రూ.1.15 లక్షలు
- బి.కొత్తకోటలో సామాజిక బహిరంగ సభ

బి.కొత్తకోట : 2023–24 ఆర్థిక సంవత్సర ంలో బి.కొత్తకోట మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.7.42 కోట్లు ఖర్చు చేశారు. ఈ చేసిన ఖర్చులో ఏమైనా అక్రమాలు జరిగాయా, నిధులు స్వాహా చేశారా, అసలు పనులే చేయకుండా నిధులు దోచుకున్నారా అన్న అంశాలపై నిజాలు నిగ్గుతేల్చేందుకు సామాజిక తనిఖీ బృందాలు మండలంలోని 15 పంచాయతీల్లో తనిఖీల నిర్వహణ పూర్తి అయింది. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ మద్దిలేటి అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కూలీలతో 11,061 పనులు చేయించగా రూ.4.92 కోట్ల వేతనాలు, మెటీరియల్‌కు రూ.49.87 లక్షలు ఖర్చు చేశారు. పీఆర్ ద్వారా 42 పనులకు కూలీలకు రూ.544, మెటీరియల్ రూ.1.92 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 4 పనులకు కూలీలకు రూ.272, మెటీరియల్ రూ.8.65 లక్షలు ఖర్చు చేశారు. ఈ మొత్తం 12,07 పనులకు రూ.7.42 కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులపై తనిఖీలు చేసేందుకు ఒక ఎస్ఆర్‌పీ, ఏడుగురు డీఆర్‌పీలు, తొమ్మిది మంది వీఎస్ఏలు పనిచేశారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై పీడీ పరిశీలించగా అక్రమాలు ఏవీ జరగనట్టు వెల్లడించారు. ఉపాధి పనుల్లో తేడాలున్నాయని, 11 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.38,716లను క్షేత్రసహాయకుల నుంచి రికవరీ పీడీ ఆదేశించగానే రూ.36,300 సొమ్మును అప్పటికప్పుడే చెల్లించేశారు. దీనిపై రూ.8వేల జరిమానాలు విధించారు. మొక్కల పెంపకం చేపట్టిన 14 మంది రైతులు వాటిని చంపేశారని, వారికి నోటీసులు జారీ చేసి మళ్లీ మొక్కల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను పీడీ ఆదేశించారు. ఈ రెండు అంశాలను గుర్తించి వెల్లడించడం కోసం సభను నిర్వహించాల్సి వచ్చింది. కాగా ఈ సామాజిక తనిఖీ నిర్వహణ కోసం చేసిన ఖర్చు రూ.1.15 లక్షలు. అంటే రూ.7.92 కోట్ల వ్యయంలో పనుల్లో కేవలం రూ.38,716 విలువైన తేడాలు గుర్తించేందుకు ఇంత సొమ్ము ఖర్చు చేశారు. ఈ సభలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏపీడీ మధుబాబు, ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ మంజుల, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



సామాజిక సభలో ఉపాధి పనుల వివరాలు వెల్లడిస్తున్న పీడీ మద్దిలేటి

బీసీజీ టీకా తప్పనిసరిగా వేసుకోవాలి

వాల్మీకిపురం : పెద్దల బీసీజీ టీకాను ఆరు వర్గాల వారు తప్పనిసరిగా వేసుకోవాలని మదనపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ పరిధిలోని గండబోయనపల్లిలో రహదారి పనుల సిబ్బంది, గ్రిల్ కార్యాలయ సిబ్బందికి టీకాలను వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీవిద్య, జులేఖబేగం, సిబ్బంది మహమ్మద్ రఫీ, సుధాకర్, నాగిరెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పీలేరు రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ జిల్లా కోఆర్డినేటర్లు రఘునాథరెడ్డి, మురళీకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక కోటపల్లె జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డయేరియా లక్షణాలు, స్టాప్ డయేరియా ప్రచార ప్రాముఖ్యత, జల్‌జీవన్ మిషన్ ప్రధాన లక్ష్యాలు, ఉపయోగాలు, నీటి పొదుపు పద్ధతులు, వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రెడ్డిబాబురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్స్‌పెక్టర్ జి. వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం తపాలాశాఖ ఇన్సూరెన్స్‌డేని పురస్కరించుకుని స్థానిక మోడల్ కాలనీలో డాక్ చౌపల్ (మీ వద్దకే తపాలా సేవలు) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, డిప్లొమా, ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామీణ ప్రాంత ప్రజల కోసం బోనస్‌తో కూడిన స్కీంలు ఉన్నట్లు తెలిపారు. మహిళలకు, ఆడ పిల్లలకు ప్రత్యేకంగా సుకన్య సంవృద్ధి యోజన, మహిళా సమ్మాన్ యోజన పథకం కింద ఖాతాలు చేసుకోవాలన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ జి. రమేష్‌బాబు, మెయిల్ ఓవర్సీస్‌లు సి.ఎస్. సుబ్రమణ్యం, హరీష్ పాల్గొన్నారు.

మదనపల్లె డిపోకు కొత్త బస్సులు

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ–1 డిపోకు త్వరలో కొత్త బస్సులు రానున్నాయని జిల్లా ప్రజారవాణాధికారి రాము తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలను తనిఖీ చేశారు. సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. వన్ డిపోకు 15 కొత్త అద్దె బస్సులు రానున్నాయని తెలిపారు. అలాగే డిపో–2కు కూడా కొత్త బస్సులు వస్తాయన్నారు. ఆదాయం పెంచేందుకు అందరూ కలిసి సమష్టిగా పని చేయాలన్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించి సంస్థ మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, డిసి ప్రభుదాస్, సీఐలు రేవతి, గీత, ఎంఎఫ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

గుర్రంకొండ : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. మంగళవారం మండలంలోని తరిగొండ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాల్యవివాహాలు ఎక్కడ జరుగుతున్నా అడ్డుకోవాలన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే తల్లిదండ్రులపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. వివాహ సమయాల్లో వరకట్నం తీసుకోకూడదన్నారు. బేటీపడావో.. బేటీ బచావో పథకాన్ని తల్లులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా బాలింతలు, పిల్లల తల్లులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీనరసమ్మ, తులసి, చిన్నపాప, మహిళలు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

కేవీపల్లె : విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రెడ్డి బాషా అన్నారు. మంగళవారం మండలంలోని నూతనకాల్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ (విద్యా వారోత్సవాలు) కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ 4వ వార్షికోత్సవంలో భాగంగా రెండవ రోజు సంఖ్యా శాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రయ్య, ఏపీ సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.